క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



బలిజిపేట వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు సురేష్

బలిజిపేట: ఆషాఢమాసం తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినంతో రానున్న రోజులలో పూజల నిర్వహణకు మార్గం సుగమమైనట్లేనని అర్చకులు చెబుతున్నారు. అందులో భాగంగా బలిజిపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు హరి ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినం ఎంతో గొప్పదని స్వామివారిని ప్రార్థించి ఆయన కృపకు పాత్రులవ్వాలని అర్చకుడు హరి భక్తులకు సూచించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్ష ప్రారంభం



శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం చేస్తున్న భక్తులు

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట సీతారామదేవస్థానం వద్ద సామూహిక శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రారంభించారు. చాతుర్మాస దీక్షలో భాగంగా ప్రారంభించిన ఈ సామూహిక శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం నవంబరు 2 కార్తీక శుద్ధ ద్వాదశి వరకు ప్రతిరోజూ ఉదయం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ స్థాయి సమ్మెను విజయవంతం చేయాలి



ఆర్.వెంకంపేటలో ప్రజా సంఘాల మద్దతు కోరుతున్న భవన నిర్మాణసంఘం నాయకులు

సీతానగరం: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల9 నిర్వహించనున్న జాతీయ స్థాయి సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ, అసంఘటిత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు ఆర్.రాము, జి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు మండలంలోని గ్రామాల్లో పర్యటించి సమ్మెలో పాల్గొనాలంటూ గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సుల్లో భాగంగా ఆదివారం ఆర్.వెంకంపేటలో వడ్రంగి, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మిక సంఘాల సభ్యుల మద్దతు కోరుతూ ప్రచారం చేశారు.

జగజ్జీవన్‌రామ్‌కు రుణపడి ఉంటాం



జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు, హరిత విప్లవానికి నాంది పలికిన మహోన్నత వ్యక్తికి మనమంతా రుణపడి ఉండాలని జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులు కాగాన సల్మాన్, విజయ్‌కుమార్‌లు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సౌందర్య థియేటర్ రోడ్డు వీధిలో గల మాజీ ఉప ప్రధాని వర్ధంతిని పురస్కరించుకుని ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పత్తి బకాయిలు చెల్లించాలి

భామిని: పత్తి కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ముడిపత్తి బకాయిలు ఇంత వరకు చెల్లించకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, మండల నాయకులు కొత్తకోట బాబూరావు, బిడ్డిక కాంతారావు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ...ఈ ఏడాది జనవరిలో కొనుగోలు కేంద్రంలో చాలా మంది రైతులు పత్తి విక్రయించారన్నారు. అయితే ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



సీతానగరం: పశువైద్య కేంద్రంలో రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న ఏ.డి డాక్టర్ శ్రీనివాసరావు



సీతానగరం: నిడగల్లులో వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ రామారావు



బలిజిపేటలో కుక్కకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ గణేష్



పెంపుడు కుక్కలకు టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖ ఏ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

- మండలాల్లో ప్రపంచ జునోసిస్ దినోత్సవం

బలిజిపేట: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా సీతానగరం, బలిజిపేట మండలాల్లోని పశుసంవర్థక శాఖ కార్యాలయాల్లో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా బలిజిపేట మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో బలిజిపేట, బర్లి, చిలకలపల్లి పశువైద్యకేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలకు ఇంజక్షన్లు చేసినట్లు తెలిపాఉఉ. పెంపుడు కుక్కలను ఏ విధంగా పెంచాలో యజమానులకు వివరించారు.

పట్టణ సమస్యలు పట్టవా..?



పట్టణంలోని కొత్తవలస సమీపంలో పార్వతీపురం-పాలకొండ రహదారిపై గుంతలు

- వర్షం పడితే తిప్పనితిప్పలు
- రోడ్లు గుంతలమయం
- రోడ్లపైనే పశువులు

పార్వతీపురంటౌన్:

అసలే వర్షా కాలం..రోడ్లు గుంతలయమం.. వర్షం పడితే రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. జిల్లా కేంద్రంలో సమస్యలు తిష్టవేశాయి. అధ్వాన రోడ్లు, కాలువలు..అభివృద్ధి జరగని ప్రాంతాలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని రాయగడ రోడ్డు, పార్వతీపురం-పాలకొండ రహదారి, బైపాస్ రోడ్డులలో గల గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రయాణం చేయాలంటే



పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డుపైనే పశువులు

ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులు, అధికారులకు పట్టణ సమస్యలు పట్టడం లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డుపైనే పశువులు..

జిల్లా కేంద్రంలో పశువులు రోడ్లపైనే సంచరిస్తుండడంతో అటు వాహన చోదకులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిపై పశువులు రోడ్లపైనే సేద తీరడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. సంవత్సర కాలంగా ఇదే సమస్య ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పలు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, మార్కెట్ కూడళ్లు ఉండడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్లపై పశువులను వదిలేయకుండా యజమానులను కట్టడి చేయాల్సి ఉన్నప్పటికీ పురపాలకసంఘం అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా పట్టణంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి పశువులను రోడ్లపై రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పట్టణ శివారులో పార్వతీపురం-రాయగడ రహదారిపై గుంతలు



బైపాస్ రహదారిలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు



వైఎస్సార్ కూడలి వద్ద రహదారిపై గుంతలు

ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తచర్యగా ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌లు ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్నవారు ద్విచక్రవాహనాలతో ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రమాదాల బారిన పడుతూ రక్తస్రావంతో ప్రాణాయంలో ఉంటున్నారన్నారు. ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. హెల్మెట్‌లు ధరించని ద్విచక్ర వాహన చోదకులపై కేసులు నమోదు చేసి, అపరాధరుసుం విధించనున్నట్లు తెలియజేశారు. ద్విచక్ర వాహనాలను చిన్న పిల్లలకు ఇస్తే ప్రమాదానికి గురైతే వాహన యజమానికి, డ్రైవింగ్ చేసే వ్యక్తిపై కేసులు ఉంటాయని పిల్లల భవిష్యత్‌పై ప్రభావం పడుతుందన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనానికి చెందిన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

లేబర్ అధికారులు లేకుండా కార్మికులకు న్యాయం ఎలా?

సాలూరు: జిల్లాలో సాలూరు, పార్వతీపురం, పాలకొండ అసిస్టెంట్ లేబర్ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో లేబర్ అధికారులు లేరని, అధికారులు లేకుండా కార్మికులకు న్యాయం ఎలా చేయగలరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇన్‌చార్జ్ లేబర్ అధికారులను నియమించి, కార్మికశాఖను నిద్రావస్థలోకి రాష్ట్ర ప్రభుత్వం నెట్టేసిందని విమర్శించారు.జిల్లాలో ఇప్పటికే పరిశ్రమలు లేక కార్మికవర్గం దీనస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జీగిరాం జూట్ మిల్లు మూసివేసినా ప్రభుత్వం, లేబర్ అధికారుల్లో చలనం లేదని విమర్శించారు. కలెక్టర్ స్పందించి జిల్లాలో అవసరమైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌లను నియమించి, ప్రజలకు సేవలు అందేందుకు కృషిచేయాలని కోరారు. లేకుంటే భవిష్యత్‌లో వచ్చే కార్మిక సమస్యలపై పెద్దఎత్తున ఆందోళనకు సీఐటీయూ కార్మికవర్గాన్ని సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, మధుమోహన్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఎన్‌వైనాయుడు తదితరులు

రామినాయుడుకు ఘనంగా నివాళి

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోను రామినాయుడు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం వేకువజామున గ్రామంలో ఉన్న వారి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆ గ్రామానికి వెళ్లి రామినాయుడు అంతిమయాత్రలో పాల్గొన్నారు. రామినాయుడు సేవలు మరువలేనివని, కృష్ణపల్లిలో చెరగని ముద్ర వేశారని, ముక్కుసూటి వ్యక్తిత్వంతో విలువైన రాజకీయాలు చేసిన ఓ మంచి నాయకుడని జోగారావు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రామినాయుడు భౌతికాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నం

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా మండలంలో ఖరీఫ్ వరి సాగు చేయాల్సిన భూముల్లో ఖనిజ లవణాలు, సేంద్రియ ఎరువు ఉత్పత్తికి రైతులు పచ్చిరొట్ట వేసి వరి నాట్లు వేసేందుకు అవసరమైన పనులు చేపట్టారు. 20 రోజుల క్రితం పచ్చిరొట్ట పంట సాగు చేయగా 10 రోజుల క్రితం వరినారు వేశారు. వరినారులో తెగుళ్ల నివారణకు ఎరువులు, మందులు పిచికారీ చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పచ్చిరొట్ట పంటవేసిన మడులను దమ్ము చేసి కలియదున్నే పనులను రైతులు చేపట్టనున్నారు.

పాట పాడి వరినాట్లు వేసి

పార్వతీపురం రూరల్: 'తొలి మబ్బు మెరిసింది.. తొలకరి కురిసింది. రైతన్న కన్నుల్లో వెలుగు విరిసింది. పచ్చగా ఉడుపు మడి నవ్వింది. పల్లెపల్లెకు కొత్త పండగ వచ్చింది'' అంటూ మహిళలు పాటలు పాడుతూ ఉత్సాహంగా వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు ఇప్పటికే వరినారు మళ్లు సిద్ధం చేసిన రైతన్నలు నాట్లు వేయడం ప్రారంభించారు. మండలంలో 20,200ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంటను సేద్యం చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గంగాపురం, ములగ, సంగంవలస, కవిటిభద్ర తదితర గ్రామాల్లో వరి ఉభాలకు అనుకూలంగా ఉండడంతో నాట్లు వేస్తున్నారు.



పార్వతీపురం రూరల్: పాటపాడుతూ సంగంవలసలో వరినాట్లు వేస్తున్న మహిళలు

ఘనంగా ఏకలవ్య వీరుడి జయంతి



ఏకలవ్య వీరుడికి నివాళులర్పిస్తున్న ఎరుకుల కులస్తులు

సీతానగరం: ఏకలవ్యుడి ఆశయ సాధనను అందరూ స్ఫూర్తిగా తీసుకుని ఎరుకుల కులస్తులకు సేవలందించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎరుకల కుల నాయకుడు సత్యనారాయణ అన్నారు. ఎరుకుల జాతి మూల పురుషుడు, ఆరాధ్య దైవం ఏకలవ్య వీరుడు జయంతిని ఆషాడ మాసంలో ఏకాదశి రోజును పురస్కరించుకుని ఆదివారం సీతానగరం మండలంలోని సుభద్ర సీతారాంపురంలో ఎరుకుల జాతి కుటుంబాలు ఏకలవ్య జయంతి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్.దుర్గమ్మ, ఎరుకుల కుల పెద్దలు గొర్లి రఘు, జి ప్రసాద్, డి తిరుపతిరావు, జి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇష్టానుసారం వాహనాల నిలుపుదల



ముందు వాహనం నిలిచిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్

- స్తంభిస్తున్న ట్రాఫిక్

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ఎటువైపు వెళ్లినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లు సరిగ్గా లేక, విస్తీర్ణం చాలక తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహన చోదకులు భారీ వాహనాల రాకపోకలతో మరింత ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. ఇదిలా ఉంటే కొంతమంది భారీ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ ఇష్టాను సారం కొంతసేపు నిలిపివేస్తుండడంతో వెనుకవైపు వస్తున్న పదుల సంఖ్యలో వాహనాలు వేచి ఉండి ట్రాఫిక్ సమస్యకు గురవుతున్న పరిస్థితి నెలకొంటోంది. బాధ్యతా రహితంగా రద్దీగా ఉండే కూడళ్లలో సైతం వాహనాలను వారికి ఇష్టం వచ్చినట్లు నిలిపివేస్తున్నారని, దీంతో ద్విచక్ర వాహన దారులకు, అత్యవసర సేవలందించే వాహనాలకు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో కొరవడిన సంక్షేమం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- బాధ్యతారాహిత్యంగా ఉన్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురం రూరల్:

మండలంలోని డోకిశీల ఆశ్రమ పాఠశాలలో సంక్షేమం కొరవడిన కారణంగా విద్యార్థులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఆశ్రమ పాఠశాలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించామన్నారు. పాఠశాలలో మెనూ ప్రకారం బిర్యానీ, లేదా చికెన్ ఉంటే అన్నంతో చికెన్ కూరను పెట్టాలని, కానీ చికెన్‌లో నాణ్యత కొరవడడం మీల్‌మేకర్లు కలిపి విద్యార్థులకు వండి పెట్టడాన్ని వారు ప్రత్యక్షంగా చూసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తా చెదారాలను విద్యార్థులే శుభ్రపరచడాన్ని గమనించామన్నారు. విద్యార్థులకు పాఠశాలలో సెల్‌ఫోన్ల వినియోగానికి ఆస్కారం ఇచ్చిన సిబ్బంది తీరు చూస్తుంటే ఆశ్చర్యం కలిగిందన్నారు. పాఠశాలలో ఎవరి తీరు వారే అన్నట్లుగా పట్టించుకునే వారేలేక బాధ్యతారాహిత్యంగా సిబ్బంది వ్యవహరించడంతో విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా పాఠశాల గేటు దాటి సమీపంలో ఉన్న డోకిశీల గ్రామంలో రోడ్లపై తిరుగుతున్నారని, జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.



చికెన్ కూరలో మీల్‌మేకర్లు కలిపి విద్యార్థులకు వడ్డించిన వంటకం

నాణ్యత లేని భోజనం

మెనూ సక్రమంగా అమలు చేయలేకపోవడమే కాకుండా కూరల్లో లేనిపోనివి కలిపి నాణ్యత లేకుండా సర్దుబాటు చేస్తూ విద్యార్థులకు వడ్డిస్తున్నారని రవికుమార్ అన్నారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు తనకు తెలియజేశారన్నారు. పేద విద్యార్థులకు పూర్తిస్థాయిలో సంక్షేమాన్ని అందించాల్సిందిపోయి ప్రభుత్వం ఇస్తున్న వస్తువులను సక్రమంగా వినియోగించకుండా సర్దుబాటు చేసి విద్యార్థులను ఈ విధంగా ఇబ్బందులకు గురిచేసే హక్కు ఎవరు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలతోపాటు వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆశ్రమ పాఠశాలలో కొరవడిన సంక్షేమాన్ని మరింత మెరుగ్గా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల గదులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

విద్యార్థుల ఆకలి కేకలు కనిపించడం లేదా..?

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని.. దీంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. విద్యార్థుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం హయాంలో విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. పాఠశాలలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించామన్నారు. విద్యార్థుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 8న జరగనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.